ఐదింతలైన
ఎయిర్‌టెల్ లాభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.16,134.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,876.4 కోట్ల లాభంతో పోలిస్తే ఐదు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.45, 129.30 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

ఎన్ఎండీసీ ఆకర్షణీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: ఎన్ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,897 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,492.73 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం ఎగబాకింది. కంపెనీ ఆదాయం 21 శాతం ఎగబాకి రూ.6,942.92 కోట్లకు చేరుకున్నది.

ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

సొంతంగా ఏర్పాటు చేసేందుకు ముందుకురాని జెన్‌కో

కేంద్ర సాయంతోపాటు 70 ఎకరాల జెన్‌కో స్థలాన్ని అస్మదీయులకు అప్పగించేందుకు సర్కారు కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.

విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవిత కాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్ల పైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతో పాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

అస్మదీయుల కోసమేనా?

బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతోపాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్బీఐ లాభం 16,891 కోట్లు

క్యూ3లో 84 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,891 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధిని సాధించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.1,28,467 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది సమకూరిన రూ.1,18,193 కోట్లతో పోలిస్తే ఇది 8.69 శాతం అధికం. దీంట్లో వడ్డీల రూపంలో రూ.1,17,427 కోట్లు సమకూరినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ విలువ 0.64 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చింది.
- ఎస్బీఐ గ్రూపు కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 70 శాతం ఎగబాకి రూ.18,853 కోట్లకు చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.11,064 కోట్లుగా ఉన్నది. అలాగే ఆదాయం రూ.1,53,072 కోట్ల నుంచి రూ.1,67,854 కోట్లకు ఎగబాకింది.
- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 4 శాతం అధికమై 41,446 కోట్లుగా నమోదైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.911 కోట్ల నిధులను వెచ్చించింది.

నష్టాల్లో మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలపరంపర కొనసాగుతున్నది. రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షకంటే ముందు మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపడంతోపాటు ఎఫ్ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 213.12 పాయింట్లు కోల్పోయి 78,058.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.

అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 6: అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.846 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని మాత్రమే గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.940 కోట్లతో పోలిస్తే 10 శాతం తగ్గినట్లు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,352 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,979 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

కొత్త బాస్.. కోతకు సై!



నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయం
నూతన గవర్నర్ వడ్డీరేట్లను తగ్గిస్తారన్న అంచనాలు
రెపో రేటు పావు శాతం దిగివచ్చే అవకాశం

ముంబై, ఫిబ్రవరి 6: ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరుగుతున్న తొలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలే ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ ప్రకటించనున్నది. అయితే ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. నిజానికి గత ద్రవ్యసమీక్షలో అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్.. మున్ముందు పాలసీ రివ్యూల్లో వడ్డీరేట్లు తగ్గవచ్చన్న సంకేతాలనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమీక్ష మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు. ఈ క్రమంలో ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గితే ఐదేండ్ల తర్వాత ఇప్పుడే తగ్గినట్టు కానున్నది.

ఆటో, రియల్టీకి ఉత్సాహం?

గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై చాలాకాలం నుంచి అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. కానీ ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయంటున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలను పెంచుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్ల తగ్గింపు తొందరపాటే అవుతుందంటున్నవారూ లేకపోలేదు. ముఖ్యంగా వడ్డీరేట్లు తగ్గితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాల్లో కదలాడుతున్న సంగతి విదితమే. కానీ దేశంలో వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో తన వంతుగా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయ పన్ను ఊరటను కల్పించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వంతుగా వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ఎక్కువగా ఉన్నాయి.

జొమాటో
ఇకపై ఎటర్నల్
పేరు మార్పునకు లైన్‌క్లియర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ దిగ్గజం జొమాటో.. పేరు మార్చుకుంటున్నది. ఎటర్నల్‌గా మారిపోతున్నది. ఇందుకు గురువారం జొమాటో సంస్థ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే కంపెనీ వాటాదారులు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత అధికార వర్గాలు ఆమోదించాల్సి ఉన్నది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జొమాటో పేర్కొన్నది. కాగా, ఫుడ్ డెలివరీ బిజినెస్ బ్రాండ్ జొమాటో యాప్ పేరు మాత్రం అదే. 'పేరు మార్పునకు మా బోర్డు అంగీకరించింది. షేర్‌హోల్డర్స్ కూడా మద్దతివ్వాలని కోరుతున్నాను. కావాల్సిన అనుమతులన్నీ వచ్చాక మా కార్పొరేట్ వెబ్‌సైట్ పేరు జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌గా మారిపోతుంది. మా స్టాక్ టిక్కర్‌నూ మారుస్తాం' అని జొమాటో వ్యవస్థాపక సీఈవో దీపిందర్ తెలిపారు. ఎటర్నల్‌లో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అనే 4 వ్యాపార విభాగాలుండనున్నాయి.

టీసీఎస్ ఉద్యోగులకు షాక్

సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. డిసెంబర్ త్రైమాసికంలో సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. ఉద్యోగి పనితీరు ఆధారంగా ఈ వేరియబుల్ చెల్లింపులు జరుపుతుంటుంది సంస్థ. వరుసగా రెండు త్రైమాసికాలుగా సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచినప్పటికీ వేరియబుల్ చెల్లింపుల్లో కోత విధించడం విశేషం. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి 100 శాతం వేరియబుల్ చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. కానీ, కొత్త పెట్టిన వారిలో సీనియర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగులకు కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసిన విషయం తెలిసిందే. వేరియబుల్ పేను ఆఫీస్ హాజరుతో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీస్‌కు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులు ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్నవారికి 50 శాతం, 75-85 శాతం ఉన్నవారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే వేరియబుల్ అందుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

టీజీపీఎస్సీని సందర్శించిన
మహారాష్ట్ర బృందం
చైర్మన్ బుర్రా వెంకటేశంతో భేటీ

- అమలు చేస్తున్న సంస్కరణలపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తేతెలంగాణ): పోటీ పరీక్షల నిర్వహణలో అమలు చేస్తున్న విధానాలు, సంస్కరణలపై అధ్యయనానికి మహారాష్ట్రకు చెందిన ధనశ్రీ నటేకర్ నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం టీజీపీఎస్సీని సందర్శించింది. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంను బృందం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో టీజీపీఎస్సీ సభ్యులు ఇక్కడ అమలు చేస్తున్న విధానాలను ఆ బృందానికి వివరించారు. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా తీసుకుంటున్న చర్యలు, క్వశ్చన్ బ్యాంకు రూపకల్పనపై విడమరిచి చెప్పారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును

టెండరు నం. GE/E.29/I/207
తేది: 06-02-2025

చెల్లుబాటగు 'బి' గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ లైసెన్స్ గల కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.
భారత రాష్ట్రపతి తరపున చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ యొక్క ఎలక్ట్రికల్ బ్రాంచి, దక్షిణ మధ్య రైల్వే, వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521241 వారు దిగువ తెలిపిన పనుల కొరకు 05-03-2025న 14.45 గం.వరకు సీల్డ్ టెండరు కోరుచున్నారు.

టెండరు నం. GR/E.29/1/207, తేది: 06-02-2025. **వివరణ:** వేగన్ వర్క్‌షాప్ మరియు కాలనీ, గుంటుపల్లి వద్ద 14 నివాస భవనాలపై 59KWp (5KWp-3 నెం.లు మరియు 4 KWp-11 నెం.లు) మరియు ఒక సర్వీస్ బిల్డింగ్‌పై 60KWp సామర్థ్యం రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుచేయుట. **పరిమాణం:** 01. **పూర్తి చేయు కాలం:** 6 నెలలు. **టెండరు విలువ:** రూ. 66,07,784 (అరవై ఆరు లక్షల ఏడు వేల ఏడు వందల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే). **డిపాజిట్ చేయాల్సిన బిడ్ సెక్యూరిటీ/బయానా:** 1,32,200/- (ఒక లక్ష ముప్పై రెండు వేల రెండు వందల రూపాయలు మాత్రమే). **టెండరు డాక్యుమెంటు ధర:** ఉచితం. **ఆఫరు చెల్లుబాటు:** తెరుచు తేదీ నుండి 60 రోజులు. **టెండరు రకం:** IRGCC-2022చే రూపొందించబడిన పనుల టెండరు. **టెండరింగ్ విధానం:** బహిరంగ టెండరు-సింగిల్ ప్యాకెట్. **ఇదే తరహా పని:** వర్తించును. **బిడ్ ముగింపు తేదీ & సమయం:** 05-03-2025న 15.00 గం.వరకు. **బిడ్ తెరుచు తేది & సమయం:** 15-15-2025న 15-15 గం.కు. **టెండరు డాక్యుమెంట్ మరియు సవరణ:** టెండరు డాక్యుమెంటు మరియు మార్పులు/ సవరణ ఏవైనా వాటి కొరకు వెబ్‌సైట్ http://www.ireps.gov.inను దర్శించండి.

A0165 **అసిస్టెంట్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, WWS, గుంటుపల్లి**

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

PUB/0130

అర్బన్ నక్సల్స్ పేరిట ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధం

- పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు
- అక్రమ ఉపా కేసులను ఎత్తివేయాలని డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): ప్రశ్నించే గొంతుకలను నిర్బంధాలకు గురిచేయాలనే ఉద్దేశంతో అర్బన్ నక్సల్స్ అనే పదాన్ని ప్రభుత్వాలు వాడుతున్నాయని పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు విమర్శించారు. ప్రతిపక్ష నేతలతోపాటు ప్రజాసంఘాల, పౌర హక్కుల నేతలను నిర్బంధాలకు గురిచేస్తామనే హెచ్చరికల్లో భాగంగా ఆ పదానికి చట్టబద్ధత కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్బన్ నక్సల్స్ పదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు నారాయణ పేర్కొన్నారు. పార్లమెంటులోనే ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీని స్వయంగా ప్రధాని మోదీనే అర్బన్ నక్సల్‌గా పేర్కొనడాన్ని కాంగ్రెస్ పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు ఏవీ కూడా ఖండించకపోవడం విచారకరమని తెలిపారు. ప్రభుత్వాన్ని నిలదీసే వారందరినీ అర్బన్ నక్సల్‌గా ప్రచారం చేసే బాధ్యత ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం నెత్తిన ఎత్తుకున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ఉపా చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా నమోదైన అక్రమ ఉపా కేసులను ఎత్తివేయాలని నారాయణరావు డిమాండ్ చేశారు.

ఎవరికీ భయపడం.. ఎస్సీ వర్గీకరణ ఆగదు

- మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): తాము ఎవరికీ భయపడమని, వర్గీకరణ ఆగే ప్రసక్తే లేదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు గురువారం మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగల సమష్టి కృషి, సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించాలన్న కాంగ్రెస్ సిద్ధాంతం, సీఎం రేవంత్ రెడ్డి కమిట్మెంట్ వల్లే వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. గతేడాది ఆగస్టు 1న వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చిన వెంటనే అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని గుర్తుచేశారు. చట్టపరమైన ఇబ్బందులు రాకుండా జ్యూడిషల్ కమిషన్ నియమించామని తెలిపారు. కమిషన్ పూర్తి శాస్త్రీయంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ నివేదిక ఇచ్చిన వెంటనే నిర్ణయం తీసుకున్నామన్నారు. అసెంబ్లీ తీర్మానం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు సుమారు 9.8 శాతం రిజర్వేషన్లు సాధించామని తెలిపారు. గ్రూప్-1లో 0.77 శాతం, గ్రూప్-2లో 9 శాతం మాదిగలకే దక్కిందన్నారు. వర్గీకరణ జరగడం ఇష్టంలేని వ్యక్తులు చేస్తున్న వ్యక్తిగత విమర్శలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వాళ్లను ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసన్నారు.

ప్రాణాల మీదికి తెచ్చిన సెల్‌ఫోన్

- కింద పడిన ఫోన్ కోసం రైలు నుంచి దూకిన యువకుడు
- విరిగిన బీ ఫార్మసీ విద్యార్థి కాళ్లు

కేసముద్రం, ఫిబ్రవరి 6 : సెల్‌ఫోన్ వినియోగం ఆ యువకుడి ప్రాణాల మీదికి తెచ్చింది. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన కోగిల అరవింద్ ఖమ్మంలో బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఇంటికి వెళ్లేందుకు విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఖమ్మంలో ఎక్కాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నె స్టేషన్ల మధ్య రైలు డోర్ వద్ద నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా కిందపడిపోయింది. ఫోన్ కోసం వెంటనే అరవింద్ రైలు నుంచి కిందకు దూకగా.. రెండు కాళ్లు విరగ్గా, చేతికి గాయాలయ్యాయి. వరంగల్ దవాఖానకు తీసుకెళ్లినట్టు హెచ్‌సీ భాస్కర్ తెలిపారు.

గాజాస్ట్రిప్‌ను వీడేవాళ్లకు సాయం

జెరూసలేం, ఫిబ్రవరి 6: గాజాస్ట్రిప్‌ను ఖాళీ చేయించి, పాలస్తీనియన్లకు పునరావాసం కల్పించాలన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదనపై ఇజ్రాయెల్ కసరత్తు చేస్తున్నది. స్వచ్ఛందంగా గాజాను వీడేవాళ్ల కోసం ఓ ప్రణాళిక రూపొందించాలని ఇజ్రాయెల్ సైన్యానికి ఆ దేశ రక్షణమంత్రి కట్జ్ ఆదేశించారు. 'గాజా నివాసితులకు వలస వెళ్లే స్వేచ్ఛను ఇవ్వాలి' అని కట్జ్ అన్నారు. గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యల్ని విమర్శించే స్పెయిన్, ఐర్లాండ్, నార్వే పాలస్తీనియన్లకు ఆశ్రయం ఇవ్వాలని కోరారు.

తినగానే పడుకుంటే తీపి రోగం!

హైదరాబాద్‌లో 20.5శాతం మంది షుగర్ పేషంట్లే..

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): అందరివీ ఉరుకుల పరుగుల జీవితాలే. అనుక్షణం పనిఒత్తిడితో సతమతమయ్యేవారెందరో. వేళకు తిండి.. సరైన నిద్ర..ఏమాత్రం శారీరక శ్రమ లేని పనులు, ఆహారపు అలవాట్లు మధుమేహానికి దారితీస్తున్నాయి. అర్ధరాత్రిళ్లు తినడం.. తిన్న వెంటనే పడుకోవడంతో చాపకింద నీరులా తియ్యగా దరిచేరి, ప్రాణాలు తీస్తోంది మహమ్మారి.. షుగర్ వ్యాధి. 15ఏండ్ల క్రితం 50ఏండ్ల వయస్సు దాటిన వారిలో మాత్రమే కనిపించే ఈ వ్యాధి.. ప్రస్తుతం 30ఏండ్లు..18ఏండ్లతోపాటు ఇంకొందరికి పుట్టుకతోనే వస్తున్నది. ఏదైనా శస్త్రచికిత్స జరిగినప్పుడే ఈ వ్యాధి వచ్చిందన్న విషయం రోగులకు తెలుస్తోంది. ఆలోపే వ్యాధి ముదురుతుండటంతో బాధితుల్లో ఆందోళన మొదలవుతున్నది. ఇలాంటి మధుమేహ బాధితుల్లో హైదరాబాద్ నగరం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుతం దేశంలో 70మిలియన్ల మందికిపైగా షుగర్‌తో బాధపడుతుండగా హైదరాబాద్‌లో 20.5శాతం మంది ఉన్నట్టు 'నేషనల్ అర్బన్ డయాబెటీస్' జరిపిన సర్వేలో బయటపడింది. మధుమేహానికి ప్రధానంగా కండ్లు, కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె తదితర అవయవాలు ప్రభావితమవుతున్నాయి. వ్యాధి వస్తే అతిగా ఆకలి, నీరసం, అతి మూత్రం, దాహం, బరువు తగ్గిపోవడం, చూపు మందగించటం తదితర లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ముందుగా గుర్తిస్తే కట్టడి సాధ్యమే..

వ్యాధి వచ్చే అవకాశాలను ముందుగానే గుర్తిస్తే రాకుండా నివారించవచ్చు. 'ప్రీ-డయాబిటిస్' దశలోనే వైద్యులను సంప్రదిస్తే వ్యాధిని ఆదిలోనే నియంత్రించవచ్చు.

50శాతం మందిలో లక్షణాలు కనిపిస్తుండగా, మిగతా వారికి కేవలం వైద్య పరీక్షల ద్వారానే బహిర్గతమవుతుంది. ప్రీ-డయాబిటిస్ దశలో గుర్తించాలంటే ఆరునెలలకు ఒక్కసారైనా ప్రజలు పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి వచ్చిన తర్వాత బాధపడటం కంటే రాకముందే జాగ్రత పడడం ఉత్తమం.

- డాక్టర్ బియాట్రిస్ అని, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, నిమ్స్ హాస్పిటల్

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం



ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరిగిందని మాల మాహానాడు నాయకులు తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గాదె కుమార్, యాలాల శ్రీనివాస్, గుయ్యని పామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మాలలు ఉంటే 19 లక్షలు మాత్రమే ఉన్నారని పేర్కొనడం సరైందికాదని వెల్లడించారు. - కందుకూరు, ఫిబ్రవరి 6:

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నేతలు

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాలల ధర్నా

ఖలీల్‌వాడి/కోటగిరి, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిజామాబాద్ జిల్లాలో మాల కులస్తులు ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంతోపాటు కోటగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం వెంటనే బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారి ప్రాణం తీసిన ఆలూ చిప్స్

మొయినాబాద్, ఫిబ్రవరి 6: ఆలూ చిప్స్ గొంతులో అడ్డంపడి ముక్కు పచ్చలారని చిన్నారి మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోలుకట్టాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఉత్తరప్రదేశ్‌కి చెందిన కూలీలు మొయినాబాద్‌కు వలస వచ్చారు. ఆరు నెలలుగా తోలుకట్టాలోని ఓ ఫామ్ హౌస్‌లో పని చేస్తున్నారు. గురువారం 20 నెలల చిన్నారికి చిప్స్ తినిపించగా గొంతులో ఇరుక్కుంది. దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి ఊపిరందక చిన్నారి మృతి చెందిందని నిర్ధారించారు.

ఎస్వీఏజీయూకు
బాంబు బెదిరింపు

- ఫేక్ అని తేల్చిన పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : తిరుపతి శ్రీవెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని పేల్చివేస్తామని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గురువారం వర్సిటీకి మెయిల్ వచ్చింది. సిబ్బంది ఎస్పీకి సమాచారం అందించారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు ఆధ్వర్యంలో పోలీసులు బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబు లేదని తేల్చి ఫేక్ బెదిరింపుగా పేర్కొన్నారు. కేరళ నుంచి మెయిల్ వచ్చిందని, రెండు నెలల క్రితం కూడా తమిళనాడు నుంచి బెదిరింపు మెయిల్ వచ్చినట్టు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీకి వచ్చేది లేదు

- వైసీపీ అధినేత వైఎస్ జగన్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీకి వచ్చేది లేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. అసెంబ్లీకి హాజరుపై గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాట్లాడటానికి సమయం ఇస్తేనే కదా అసెంబ్లీకి వెళ్లేది. సాధారణ ఎమ్మెల్యేలా టైమ్ ఇస్తామంటే ఎలా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షానికి ఎన్ని సీట్లు ఉన్నా ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్నారు.

అప్రూవర్‌కు బెదిరింపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని కడప జైలులో బెదిరింపులకు గురిచేయడంపై ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్‌ను విచారణ అధికారిగా నియమించింది. శుక్రవారం కడప జైలులో దస్తగిరిని విచారించనున్నారు. అనంతరం చైతన్యరెడ్డి, ప్రకాశారెడ్డిని విచారించే అవకాశం ఉందని సమాచారం.